క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే, ఎంపీ పర్యటన

సదుం: మండలంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి శనివారం మండలంలోపర్యటిస్తారని వారి కార్యాలయం తెలిపింది. మధ్యాహ్నం 12 గంటలకు ఎర్రాతివారిపల్లె అయ్యప్పస్వామి ఆలయాన్ని వారు దర్శించుకుంటారని తెలియజేసింది.

పుంగనూరులో..

పుంగనూరు: పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి శనివారం పట్టణంలో పర్యటిస్తారని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. వివిధ శుభ కార్యక్రమాల్లో వారు పాల్గొంటారని తెలియజేశారు.

బయ్యపల్లెలో పరామర్శ

చౌడేపల్లె: 29ఏ చింతమాకులపల్లె పంచాయతీ బయ్యపల్లెలో శనివారం ఉదయం 11 గంటలకు పుంగనూరు ఎమ్మెల్యే, రాజంపేట ఎంపీ పర్యటిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్ తెలిపారు. ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జీవన్‌రెడ్డిని వారు పరామర్శిస్తారని చెప్పారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



పలమనేరు: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ముందుగా బసవరాజు కండ్రిగలో గోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు. తదుపరి మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద నిర్వహించిన రుణమేళాలో 108 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.18.83 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీఓ బాలాజీ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఇన్బనాథన్, మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

పుంగనూరు: పట్టణంలోని త్యాగరాజ మండపంలో హిందూ ధర్మ దివ్యజ్ఞాన జ్యోతి సంస్థ విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేసింది. శుక్రవారం సంస్థ అధ్యక్షుడు వెంకటేష్, బీజేపీ నాయకుడు రాజారెడ్డి, సాయిబాబా ఆలయ ధర్మకర్త టీపీఎస్.నాగరాజు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి, వివేకానందుని జన్మదిన వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మణికంఠ, హేమంత్‌కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాప్‌లు సద్వినియోగం చేసుకోవాలి



సదుం: రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎన్‌పీఎస్‌ఎస్, ఏపీపీఎస్‌ఎస్ యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ కోరారు. మండలంలోని ఎర్రాతివారిపల్లె, చెరువుముందరపల్లెలో శుక్రవారం ఆయన సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. రైతులు తమ పంటలను ఆశించిన చీడపీడలు, తెగుళ్లకు సంబంధించిన ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వాటి నివారణ చర్యలను తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పుంగనూరు ఏడీఏ శివకుమార్, రైతు శిక్షణ కేంద్రం ఏఓ ప్రసన్న, ఏఓ మాధవి, ఏఈఓ ఖాదర్ వల్లి, మనీషా, ప్రమీల పాల్గొన్నారు.

గుడుపల్లె: కనమనపల్లెలో గరుడునిపై ఊరేగుతున్న స్వామివారు, పుంగనూరు: భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం, ప్రత్యేక అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తి







భక్తి ప్రపత్తులతో వైకుంఠ ఏకాదశి

వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వైకుంఠ ద్వార దర్శనంతో స్వామివార్లను దర్శించుకున్నారు. వివిధ ఆలయాల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి.

పలమనేరు: పట్టణంలోని వేంకటేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. గొల్లపల్లెలోని వేంకటేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల ప్రజలు దర్శించుకున్నారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అలంకరణ చేసి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు దర్శనానికి అనుమతించారు. నియోజకవర్గంతో పాటు పలు రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తారు. సర్వదర్శనం క్యూలలో టీటీడీ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అన్నమాచార్య ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. శనివారం ద్వాదశి సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామివారి తిరుచ్చి సేవ నిర్వహిస్తున్నట్టు ఆలయ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర తెలిపారు. ఆలయ అర్చకులు దేవరాజాచార్యులు, హర్షాదీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: రాయలపేట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో అర్చకులు వేకువజామున సీతా రామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి మూలవిరాట్‌లకు విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. అలాగే, బసవరాజుకండ్రిగ సమీపంలోని అన్నపూర్ణాదేవి ఆలయంలో భక్తులకు బెంగళూరులో స్థిరపడిన చలమంగళం గ్రామానికి చెందిన వెంకటేష్ దంపతులు అన్నదానం చేశారు. సర్పంచ్ రమేష్ బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: కడపనత్తం సమీపంలోని శ్రీ నల్లగుండ్రయ్యస్వామి ఆలయం, పట్నపల్లె శ్రీ కళ్యాణ వేంకటరమణస్వామి ఆలయాల్లో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వైకుంఠ ద్వారం గుండా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వి.కోటలో..

వి.కోట: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వైకుంఠ ముఖ ద్వారం గుండా స్వామివారిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏడు ముఖద్వారాలు, వినాయకస్వామి, వేంకటేశ్వరస్వామి, గోవిందరాజుస్వామి, ప్రతిరూపాలు భక్తులకు కనువిందు చేశాయి. ఉదయం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దంపతులు మండలంలోని నక్కనపల్లెలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం చేసింది.

పుంగనూరులో..

పుంగనూరు: వివిధ ఆలయాల్లో వైకుంఠ ద్వారాలను తెరిచి, శ్రీవారి ఉత్సవ విగ్రహాల దర్శనం కల్పించారు. పట్టణంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ శ్రీనివాసులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

రాజనాల బండలో..

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండపై టీటీడీ ఆధ్వర్యంలో తొలిసారి వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ పర్యవేక్షించారు. అలాగే పుదిపట్ల సమీపంలో వెలసిన వైష్ణవీదేవి వేంకటేశ్వర స్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సదుంలో..

సదుం: మండలంలోని కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రంలో అభిషేకాలు, పూజలు చేశారు. స్వామి వారిని ఉత్తర ద్వారం గుండా భక్తులు దర్శించుకున్నారు. కలకటవారిపల్లె రామాలయంలో డ్రై ఫ్రూట్స్‌తో విగ్రహాలను అలంకరించారు. జోగివారిపల్లె వేంకటేశ్వరస్వామి ఆలయం, బూరగమంద భూదేవీ, శ్రీదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.


పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు చేశారు. మంగళంపేటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి, దేవళంపేటలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. గ్రామోత్సవం నిర్వహించారు.











బైరెడ్డిపల్లె: నల్లగుండ్రయ్యస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, చౌడేపల్లెలో ..., సదుం: శ్రీవారిపాదక్షేత్రంలో.., వి.కోట: స్వామి వారిని దర్శించుకుంటున్న జెడ్పీ శ్రీనివాసులు

వజ్రాలంకరణలో భక్తులకు కటాక్షం

గుడుపల్లె: మండంలోని కనమనపల్లెలో శ్రీదేవి భూదేవి శ్రీనివాసస్వామి శుక్రవారం వజ్రాలంకరణలో భక్తులను దర్శనమిచ్చారు. ఏడాదిలో వైకుంఠ ఏకాదశి రోజున మాత్రం స్వామి వారిని వజ్రాల అలంకరణంతో ముస్తాబు చేసి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించడం పరిపాటి. ఈ ద్వారం పైన గోవిందరాజస్వామిని ప్రత్యేక అలంకరణంతో అలంకరించారు. ఆలయంలో స్వామి వారిని గరుడ వాహనంపై ఊరేగించారు. అనంతరం ఆలయం ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే, గుడివంక వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, గంగాధరేశ్వరస్వామి, గుడుపల్లె వేంకటేశ్వరస్వామి, అగరంలోని తిమ్మరాయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. భజనలు చేశారు.

రామకుప్పంలో..

రామకుప్పం: మండలంలోని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. విజలాపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పించారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి









పలమనేరు: ప్రత్యేక అలంకరణతో స్వామివారు, గంగవరం: భక్తులతో నిండిన కీలపట్ల ఆలయం, వి.కోట: ఆలయంలో భజన బృందం ప్రదర్శన, కల్లూరు: లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పించరూ!

రొంపిచెర్ల: గ్రామ పంచాయతీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని సర్పంచ్ ఇబ్రహీంఖాన్ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో వార్షిక ప్రణాళిక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ, అధికారులు గ్రామాల్లో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకుని వస్తే వాటికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బాలుర, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో గ్రౌండ్‌కు మరమ్మతులు చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు సభ దృష్టికి తెచ్చారు. వీటిని జెడ్పీ నిధులతో మంజూరు చేసేందుకు చర్యలుతీసుకుంటామని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలియజేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలల్లో మరుగుదొడ్లను నిర్మించాలని అన్నారు. హెచ్‌ఎంపీవీ వైరస్ గురించి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని డాక్టర్ వినయ్ తెలిపారు. సమావేశంలో డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, ఎంఈఓ ఇందిర, కార్యదర్శులు సత్యంరెడ్డి, శేఖర్ రెడ్డి, ఇతర అధికారులు, వార్డు మెంబర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ ఇబ్రహీంఖాన్

నేడు విద్యుత్ కట్

కుప్పం రూరల్: కుప్పం 132/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయనున్న దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈఈ మునికిరణ్ తెలిపారు. కుప్పం, గుడుపల్లె, మల్లానూరు, కంగుంది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు, రైతులు దీనికి సహకరించాలని కోరారు.

పలమనేరు: పట్టణంలోని 220 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా పలమనేరు మున్సిపాలిటీ, పలమనేరు, గంగవరం మండలాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ శుక్రవారం తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించరూ!



పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఏపీఎన్జీవో నేత ఆనంద్‌బాబు శుక్రవారం స్థానిక కమిషనర్ రమణారెడ్డిని కోరారు. ఆయన మాట్లాడుతూ, సెలవు రోజుల్లో సైతం వారికి విధులను కేటాయిస్తున్నారని, వివిధ సర్వేల పేరిట ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు లక్ష్మీపతి, రమణ, హైదర్ పాల్గొన్నారు.

కుప్పం విద్యార్థులకు అభినందన



కుప్పం రూరల్: కుప్పం పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో చదువుతున్న శివశంకర్, శ్యామ్‌సన్‌లను రాష్ట్ర ఐటీ మంత్రి లోకేష్ అభినందించారు. రాష్ట్రస్థాయి పాలిటెక్ ఫెస్ట్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ×లో కాస్ట్ ఫుడ్ ఫీడర్ ఫర్ లిమ్‌లెస్ పీపుల్₹ అనే పరికరానికి ప్రశంసలు అందాయి. కాళ్లు చేతులు లేని వారికి ఈ పరికరంతో ఆహారం అందించేందుకు రూపొందించినట్లు విద్యార్థులు చెప్పారు. దీనిపై విద్యార్థులను మంత్రి ప్రత్యేకంగా అభినందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్నాథరావు తెలిపారు.

ఉపాధిపై సామాజిక తనిఖీ బహిరంగ సభ

గుడుపల్లె: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లుకు పనులు, మస్టర్లపై అవగాహన కల్పించాలని పీడీ రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేసిన ఉపాధి పనులపై వారం రోజులుగా గ్రామాలలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ ఆడిట్ రిపోర్ట్‌ను పీడీకి అందజేశారు. 18 గ్రామ పంచాయతీలకు సంబంధించి చేసిన 713 పనుల్లో కూలీలకు జాబ్‌కార్డుల ద్వారా రూ.8,27,45, 907, మెటీరియల్‌కు రూ.34,04, 738, వ్యయం చేసినట్లు వెల్లడించారు. సోషల్ ఆడిట్ చేయడంతో రూ 1,16, 631 రికవరీ చేశారు. మస్టర్లలో సక్రమంగా పేర్లు నమోదు చేయక పోవడంతో పాటు వివిధ కారణాలతో రూ 69 వేలు పెనాల్టీ విధించారు. అధికారులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న పీడీ

మున్సిపల్ బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. శుక్రవారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘ సాధారణ నిధులపై 2024-25 సవరణ బడ్జెట్ అంచనాలు,2025-26 వార్షిక బడ్జెట్ అంచనాలపై కౌన్సిల్ ఆమోదంపై సమావేశం నిర్వహించారు. చాముండేశ్వరి మాట్లాడుతూ, 2023-24కు సంబంధించి బడ్జెట్ రూ.12.38కోట్లుగా, 2024-25కు సంబంధించి(బీఈ) రూ.12.75కోట్లుగా, ఆర్‌బీఈ రూ.16.18 కోట్లుగా, 2025-26కు బీఈ రూ.20.41కోట్లుగా వెల్లడించారు. దీనికి పాలకమండలి ఆమోదం తెలిపింది. ఈ బడ్జెట్‌లో పట్టణ నీటి సరఫరాకు 20%, డ్రైన్లకు 13%, రోడ్లకు 19%, లైట్లకు 7%, పార్కులకు 10%, ఇతరత్రాలకు 17%గా తెలిపారు. మరోవైపు మున్సిపాటిలో స్లమ్ ప్రాంతాల అభివృద్ధికి రూ.40%, ఎస్సీలు 17%, ఎస్టీలకు 5%, మహిళా, శిశు సంక్షేమానికి 5%, డిజబుల్స్‌కు 3% ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సిబ్బంది, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు యూనిఫాం పంపిణీ



మున్సిపల్ కార్మికులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్

పలమనేరు: మున్సిలిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి శుక్రవారం యూనిఫాం పంపిణీ చేశారు. వారి సేవలను ఆమె ప్రస్తుతించారు. చైనా వైరస్‌పై ప్రజల్లో భయాందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో పట్టణాన్ని మరింత శుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలను తీసుకుంటున్నట్టు ఆమె చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు రవి, గుల్జార్, కౌన్సిలర్లు, కమిషనర్ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి వస్తున్నా గుంతలే!

- ఇప్పటిదాకా తూతూమంత్రగానే మరమ్మతులు
- 80శాతం రోడ్లకు తప్పని గుంతలు
- ప్రజలకు తప్పని తిప్పలు
- ఇదీ పలమనేరు నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి

పలమనేరు: ఈ దఫా సంక్రాంతి పండుగకు బయటి ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చేవాళ్లు ఇక్కడున్న రోడ్లను చూసి ఆనందపడాలని సీఎం చంద్రబాబు చెప్పిన మాట. కానీ అవన్నీ క్షేత్రస్థాయిలో వచ్చి అబద్ధాలుగానే మారాయి. పలమనేరు నియోజకవర్గంలో 250 కిమీ తారురోడ్లు ఉండగా వాటిలో 60శాతం రోడ్లు వర్షాల కారణంగా అధ్వాన్నంగా మారాయి. కానీ కూటమి ప్రభుత్వం ఇక్కడ రూ.4.13కోట్లతో 6,395 మీటర్ల మేర రోడ్డు మరమ్మతులు చేసినట్టు చెబుతున్నా అవికూడా అంతంత మాత్రంగానే నాసిరకంగా వేశారు. దీంతో పండుగకు ఇక్కడికొచ్చే వాళ్లు ఈ దుస్థితి రోడ్లను ప్రత్యక్షంగా తిలకిస్తేగానీ కూటమి మాటలు ఎంత గట్టివో అర్థమవుతుంది.

వి.కోట మండలంలో మాత్రమే..

వి.కోట మండలంలోని ముదరందొడ్డి, ఎస్ బండపల్లి, బైరుపల్లి, పాముగానిపల్లి, పెద్దపంజాణి మండలంలోని చామనేరు రోడ్లలో మరమ్మతులకు సంబంధించి రూ.4.13 కోట్లతో 6,395 మీటర్ల మరమ్మతులు నిధులను మంజూరు చేశారు. దీంతో ఈ పనులు దక్కించుకున్న కూటమి కాంట్రాక్టర్లు సైతం వారికి సొమ్ము మిగిలేలా పైపై సొగసులు చేసి తూతూమంత్రంగానే పనులు చేశారు. ఇవి మరో నెలకూడా ఉంటాయనే నమ్మకం లేదు.

ఈ రోడ్లను ఓ సారీ చూద్దామా...

పలమనేరు నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి ఘోరంగా తయారైంది. బైరెడ్డిపల్లి మండలంలోని కడపనత్తం రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. ఈమార్గంలో కనీసం ఆటోలు సైతం వెళ్లని పరిస్థితి నెలకొంది. పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ ఎర్రగొండేల్లి-మాదిగబండ రహదారిలో రోడ్డుపై వానపడితే నాలుగడుల నీరు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వి.కోట పట్టణం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని కేజీఎఫ్‌కు వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయమైంది. దీంతో ఈ మార్గంలో వాహనాలు వెళ్లడం కష్టతరమైంది. పట్టణంలోని భార త్‌నగర్‌లో అయితే రోడ్డు అధ్వాన్నంగా మారింది. పెద్దపంజాణి మండలంలోని చెన్నారెడ్డిపల్లి రోడ్డు వర్షాల కారణంగా బురదమయమైంది. ఈమార్గంలో ద్విచక్రవాహనాల్లో వెళ్లాలన్నా వీలుకాని పరిస్థితి నెలకొంది. గంగవరం మండలంలోని కీలపట్ల రోడ్డు సైతం అధ్వాన్నంగా మారింది. ఇవి వి.కోట మండలంలోని గెస్టింపల్లి రోడ్డు మరీ ఘోరంగా మారింది. వీటన్నింటిని అసలు పట్టించుకోకుండా తూతూమంత్రంగా రోడ్ల మరమ్మతులు చేశామని కూటమి నేతలు గొప్పలు చెప్పుకోవడం మినహా వాస్తవంగా రోడ్ల మరమ్మతులు పూర్తిస్థాయిలో అసలు జరగలేదనేదనేది ప్రజలకే తెలుసు.



గుంతలమయమైన కడపనత్తంలో రహదారి



దాసార్లపల్లెలో నాసిరకంగా వేసిన ప్యాచ్ వర్క్

ఇళ్ల స్థలాల కోసం ధర్నా



ధర్నా చేస్తున్న జనార్దన్, సీపీఐ నాయకులు

పుంగనూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు 3 సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జనార్దన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా హామీలను నెరవేర్చిన పాపానపోవడం లేదని విమర్శించారు.కార్యక్రమంలో రత్నమ్మ, పరమేశ్వర్, కిషోర్, రాజమ్మ, కవిత, శాంతమ్మ, జరీనాబి పాల్గొన్నారు.

ఇద్దరికి పురస్కారాలు

పలమనేరు: ఈనెల 18న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వహించనున్న తెలుగు స్మారక పురస్కారాల్లో పైనేని చిన్నబ్బనాయుడు పురస్కారాన్ని కర్నూలు జిల్లాకు చెందిన కవి హరికిషన్‌కు, బసయ్య స్మారక పురస్కారాన్ని గుమ్మడి జయరామరెడ్డికి ప్రదానం చేయనున్నట్టు సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు శుక్రవారం తెలిపారు. స్థానిక కళామందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పలమనేరు, కుప్పం : 93981 01870
పుంగనూరు : 96524 21441